# సావిత్ర్యుపనిషత్తు

– డా. రామనాథపరిమి

**ఉపోద్ఘాతము :**

సామవేదాంతర్గతమై, సవితృసావిత్రీదేవతావిజ్ఞానంతో పాటుగా బల, అతిబలా అనే మహామంత్రద్వయాన్ని అనుగ్రహిస్తున్నదీ సావిత్ర్యుపనిషత్తు. దేవతాజిజ్ఞాస, మంత్రజిజ్ఞాస ఏ విధంగా ఉండాలో ఉపాస్యదేవతను ఏ విధంగా దర్శించాలో దేవతోపాసనలో లోతులేమిటో ఈ ఉపనిషత్తు మనకు చెబుతున్నది.

దేవతోపాసన వేదనిర్దిష్టం. ఉపనిషత్తులంటే మహావాక్యాలేననీ **"అహం బ్రహ్మాస్మి"** అని అనుకోగలిగితే చాలనీ పూజాపునస్కారాది సదాచారాలను లోకువకట్టి ధిక్కరించేవారికి చెంపపెట్టుగా ఒక మంత్రవిద్యను మనముందు ప్రతిష్ఠాపన చేయడానికి ఈ ఉపనిషత్తు ఉదయించింది. దేవతోపాసన ఒక విద్య. ఒక తపఃప్రాణము. దేవతోపాసన అనే నావ సహాయం లేకుండా సంసారాంబుధిని దాటి బ్రహ్మజ్ఞాన సామ్రాజ్యాన్ని చేరుకోవడం అసాధ్యం. ఆ సిద్ధి ఒకవేళ ఉపాసన లేకుండా ఒక వ్యక్తికి సాధ్యపడిందంటే అది అతని పూర్వతపఃఫలంగా భావించాలి తప్ప దానిని సామాన్యనియమంగా అనుకోవడం మూర్ఖత్వం. వేదప్రతిపాదితమైన ప్రతీ విద్యా వంద్యమైనదే.

మంత్రబలం వేదాంతతత్త్వం అనుభూతిగా పరిణమించడానికి దోహదం చేస్తుంది. వేదప్రతిపాదితమైన దేవత బ్రహ్మవిద్యాస్వరూపం. కనుకనే ముక్తినిచ్చే శక్తిని కలిగిఉంటుంది. ఆ దేవతను బీజశబ్దరూపంగా ఆవాహన చేయడమంటే బ్రహ్మజ్ఞానాన్ని ఆవాహన చేయడమే. దేవతా కరావలంబాన్ని మించిన వస్తువు ఈ విశ్వంలో ఏమున్నది కనుక?

దేవతను తెలుసుకోగోరి వేయబడిన ప్రశ్నే ప్రశ్న. ఈ జిజ్ఞాసే జిజ్ఞాస. అటువంటి కః సవితా కా సావిత్రీ అనే ప్రశ్నలతో ఉపనిషత్తు ప్రారంభమౌతున్నది. మొదటి సమాధానం – అగ్నియే సవిత. పృథివే సావిత్రి. ఈ రెంటికీ అవినాభావసంబంధము చెప్పబడింది. ఎక్కడ అగ్ని ఉంటుందో అక్కడ పృథివి ఉంటుంది. ఎక్కడ పృథ్వి ఉంటుందో అక్కడ అగ్ని ఉంటుంది. ఈ రెండూ పరస్పరమూ జనన స్థానాలు. వీటి కలయిక ఒక్కటి. రెండవ సమాధానం — వరుణుడే సవిత. నీరు సావిత్రి. ఈ రెంటికీ అవినాభావసంగము. ఎక్కడ వరుణుడుంటాడో అక్కడ నీరు. ఎక్కడ జలము ఉంటే అక్కడ వరుణుడుంటాడు. ఇవి రెండుగా యోని. మిథునంగా ఏకము.

మూడవ సమాధానం వాయువే సవిత. ఆకాశమే సావిత్రి. నాలుగవ సమాధానం యజ్ఞమే సవిత. వేదములు సావిత్రి. ఐదవసమాధానం మేఘమే సవిత. విద్యుత్తు సావిత్రి. ఆరవ సమాధానం – ఆదిత్యుడు సవిత. తేజోంఽబరం సావిత్రి. ఏడవ సమాధానం— చంద్రుడు సవిత. నక్షత్రమండలం సావిత్రి. ఎనిమిదవ సమాధానం మనస్సు సవిత. వాక్కు సావిత్రి. తొమ్మిదవ సమాధానం పురుషుడు సవిత, స్త్రీ సావిత్రి. ఇలా తొమ్మిది విభిన్న తత్త్వాలలో చూపబడిన సవిత–సావిత్రులు పారస్పరికంగా అవినాభావసంబంధాన్ని కలిగి ఉన్నారు. సవిత ఎక్కడ ఉంటే అక్కడ సావిత్రి ఉంటుంది. ఎక్కడ సావిత్రి ఉంటుందో అక్కడ సవిత ఉంటాడు. సవిత–సావిత్రి యుగళంగా జననస్థానాలు. మిథునంగా ఒక్కటి.

ఇది దేవతాదర్శనము. మన మనోబుద్ధ్యహంకారచిత్తాల పెనతో దగ్గరగా లాగుకొని ఉపాసించవలసిన భావనాబీజము. ఇది బ్రహ్మజ్ఞానభానూదయం ముందటి సంధ్యాకాలం. ఆత్మతత్త్వాన్ని ఇవ్వగలిగే దేవతాసిద్ధి ఆత్మతత్త్వసిద్ధీ రెండు ఒకటే.సూతే లోకాదీనితి సవితా అని సవితృశబ్దానికి నైఘంటుకవ్యుత్పత్తి. లోకాలను కనేవాడు అని ఆ శబ్దానికి అర్థం.

సర్వలోకప్రసవనాత్ సవితా స తు కీర్త్యతే
యతస్తద్దేవతా దేవీ సావిత్రీత్యుచ్యతే తతః
వేదప్రసవనాచ్చాపి సావిత్రీ ప్రోచ్యతే బుధైః

అని పురాణాంతర్గతవచనం. సవితృశక్తి సావిత్రి. ఈ భగవచ్ఛక్తి సృష్టిలో ఎంత విస్తృతమై ఉందో ఉపనిషన్మాత మనకు నేర్పుతోంది. ఇదే భగవంతుడ్ని తెలుసుకునే విధానం. మన జీవితాన్ని ఆయన పాదాలవద్ద అర్పించే ముందు ఆయన ఎవరు అన్న ప్రశ్న మనలో కలగాలి. ఆ ప్రశ్నలోని తపనకి ఒక దయాంతరంగుడైన గురువు హృదయం చలించిమనతో మాట్లాడగా ఆ సమాధానం ఒక తత్త్వావలోకనానికి బాట వేయాలి. తత్త్వం పాదుకున్న మనస్సును వెనుక ఉంచుకున్న కళ్లతో స్వామి మూర్తిని చూడాలి. అప్పుడది దర్శనమవుతుంది. చెవులతో ఆయన మంత్రాలనూ కథలనూ వినాలి. అది శ్రవణమవుతుంది.ఆయన్ను ప్రేమించాలి. అది భక్తి అవుతుంది. వెరసి ఇదంతా ఉపాసనై ప్రపంచాన్ని దివ్యసామ్రాజ్యం గా మారుస్తుంది. సవితృతత్త్వము వరేణ్యమైనది. భూః తత్సవితుర్వరేణ్యమ్ అనేది దీని ప్రథమపాదము. ఇది భూతత్త్వం. ఆ పరమాత్మయే అగ్నిగా, జలంగా, చంద్రుడిగా తత్త్వభూమికలలో పూజింపదగినవాడై ఉన్నాడు. పరమాత్మ యొక్క రెండవపాదం భర్గో దేవస్య ధీమహి అనునది. అగ్ని, ఆదిత్యుడు, చంద్రుడు భర్గస్వరూపాలుగా ఉన్నారు. మూడవపాదం స్వః ధియో యో నః ప్రచోదయాత్ అనేది. మూడుపాదాలతో కూడిన ఈ వస్తువే పురుషతత్త్వం. ఇదే స్త్రీ తత్త్వం. ఈ రెండింటి మిథునమే సృష్టి. ఇది తెలిశాక ఇక సవితృబ్రహ్మము లేనిదెక్కడ?

అమృతం వంటి ఆర్ద్రకరతలాలు కలిగి సర్వసంజీవనశక్తి కలిగి పాపనాశనమొనర్చడంలో దక్షత కలిగి వేదసారమనేకాంతులతో ప్రణవమయమైన దేహాలతో ఒప్పారే బల–అతిబల అనే ఈ రెండు ఈశశక్తులనూ నేను నిరంతరం అనుభవిస్తున్నాను అని ఉపనిషన్మాత ఈ దేవత మంత్రాన్ని అందిస్తూ ధ్యానమంత్రం ద్వారా మనతో అనిపించి దేవతకు మనలను దగ్గరగా చేస్తున్నది.

సర్వదయామూర్తి అయిన అతిబలాశక్తి, సర్వక్షుద్రభ్రమోపనాశిని అయిన బలాశక్తి మానవాళిని నిరంతరమూ రక్షించుగాక. ఏ మంత్రదేవతలైతే బ్రహ్మర్షి విశ్వామిత్రుడి ముఖపద్మం నుండి వెలివడి రామలక్ష్మణుల కర్ణపుటాలను తాకి వారిద్దరికీ ఆకలిదప్పికలు లేని గొప్ప శక్తిని అనుగ్రహించాయో ఆ బలాఅతిబలా అనే ఈ దేవతలు యుద్ధం అకారణ హింస అనే ఆలోచనలను మానవాళి మెదళ్లలో నుండి చెరిపిచేసి శాంతిని వెల్లివిరియింపజేతురు గాక. అటువంటి ఉత్తమ **"ధీ"** శక్తి మానవాళిని ప్రచోదింపచేయును గాక.

స్వస్తి

# సావిత్ర్యుపనిషత్

శ్లో. సావిత్ర్యుపనిషద్వేద్యచిత్సావిత్రపదోజ్జ్వలం ।
ప్రతియోగివినిర్ముక్తం రామచంద్రపదం భజే ॥
సావిత్ర్యాత్మా పాశుపతం పరం బ్రహ్మావధూతకం ।
త్రిపురాతపనం దేవీత్రిపురా కఠభావనా ॥

ఓం ఆప్యాయంతు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః
శ్రోత్రమథో బలమింద్రియాణి చ । సర్వాణి సర్వం
బ్రహ్మోపనిషదం మాహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా
బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేస్తు
తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సంతు తే మయి సంతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అథ సావిత్ర్యుపనిషత్ ప్రారంభః**

కః సవితా కా సావిత్రీ అగ్నిరేవ సవితా పృథివీ సావిత్రీ స
యత్రాగ్నిస్తత్పృథివీ యత్ర వై పృథివీ తత్రాగ్నిస్తే ద్వే యోనీతదేకం మిథునం ॥ ॥ 1 ॥

కః సవితా కా సావిత్రీ వరుణ ఏవ సవితాపః సావిత్రీ స యత్ర
వరుణస్తదాపో యత్ర వా ఆపస్తద్వరుణస్తే ద్వే యోనిస్తదేకం మిథునం ॥ ॥ 2 ॥

కః సవితా కా సావిత్రీ వాయురేవ సవితాకాశః సావిత్రీ స యత్ర
వాయుస్తదాకాశో యత్ర వా ఆకాశస్తద్వాయుస్తే ద్వే యోనిస్తదేకం మిథునం ॥ ॥ 3 ॥

కః సవితా కా సావిత్రీ యజ్ఞ ఏవ సవితా ఛందాంసి సావిత్రీ స
యత్ర యజ్ఞస్తత్ర ఛందాంసి యత్ర వా ఛందాంసి స
యజ్ఞస్తే ద్వే యోనిస్తదేకం మిథునం ॥ ॥ 4 ॥

కః సవితా కా సావిత్రీ స్తనయిత్నురేవ సవితా విద్యుత్సావిత్రీ స
యత్ర స్తనయిత్నుస్తద్విద్యుత్ యత్ర వా విద్యుత్తత్ర స్తనయిత్నుస్తే
ద్వే యోనిస్తదేకం మిథునం ॥ ॥ 5 ॥

కః సవితా కా సావిత్రీ ఆదిత్య ఏవ సవితా ద్యౌః సావిత్రీ స
యత్రాదిత్యస్తద్ద్యౌర్యత్ర వా ద్యౌస్తదాదిత్యస్తే ద్వే యోనిస్తదేకం మిథునం ॥ 6 ॥

కః సవితా కా సావిత్రీ చంద్ర ఏవ సవితా నక్షత్రాణి సావిత్రీ
స యత్ర చంద్రస్తన్నక్షత్రాణి యత్ర వా నక్షత్రాణి స చంద్రమాస్తే
ద్వే యోనిస్తదేకం మిథునం ॥ ॥ 7 ॥

కః సవితా కా సావిత్రీ మన ఏవ సవితా వాక్ సావిత్రీ స యత్ర వా
మనస్తద్వాక్ యత్ర వా వాక్ తన్మనస్తే ద్వే యోనిస్తదేకం మిథునం ॥ 8 ॥

కః సవితా కా సావిత్రీ పురుష ఏవ సవితా స్త్రీ సావిత్రీ స యత్ర
పురుషస్తత్స్త్రీ యత్ర వా స్త్రీ స పురుషస్తే ద్వే యోనిస్తదేకం మిథునం ॥ ॥ 9 ॥

సావిత్ర్యాః పాదత్రయం తస్య ఏవ (ఏష) ప్రథమః పాదో భూస్తత్
సవితుర్వరేణ్యమిత్యగ్నిర్వై వరేణ్యమాపో వరేణ్యం చంద్రమా వరేణ్యం ॥ ॥ 10 ॥

తస్యా ఏవ (ఏష) ద్వితీయః
పాదో భర్గమయోఽపి భువో భర్గో దేవస్య ధీమహీత్యగ్నిర్వై భర్గ
ఆదిత్యో వై భర్గశ్చంద్రమా వై భర్గః ॥ ॥ 11 ॥

తస్యా ఏష తృతీయః పాదః స్వర్ధియో యో నః ప్రచోదయాదితి
స్త్రీ చైవ పురుషశ్చ ప్రజనయతః ॥ ॥ 12 ॥

సావిత్రీవేదనఫలం పునర్మృత్యుంజయః
యో వా ఏతాం సావిత్రీమేవం వేద స పునర్మృత్యుం జయతి ॥ ॥ 13 ॥

బలాతిబలయోర్విరాట్ పురుష ఋషిః గాయత్రీ ఛందః ।
గాయత్రీ దేవతా । అకారోకారమకారా బీజాద్యాః ।
క్షుధాఽఽదినిరసనే వినియోగః । క్లీమిత్యాదిషడంగం (షడంగన్యాసః)।
ధ్యానం । అమృతకర(తలాగ్రౌ)తలార్ద్రౌ సర్వసంజీవనాఢ్యా
వఘహరణసుదక్షౌ వేదసారే మయూఖే ।
ప్రణవమయవికారౌ భాస్కరాకారదేహౌ
సతతమనూభవేఽహం తౌ బలాతిబలాంతౌ ।

ఓం హ్రీం బలే మహాదేవి హ్రీం మహాబలే క్లీం
చతుర్విధపురుషార్థసిద్ధిప్రదే తత్సవితుర్వరదాత్మికే
హ్రీం వరేణ్యం భర్గో దేవస్య వరదాత్మికే అతిబలే సర్వదయామూర్తే
బలే సర్వక్షుద్రమోపనాశిని ధీమహి ధియో యో నోర్జాతే ప్రచుర్యః
యో ప్రచోదయాదాత్మికే ప్రణవశిరస్కాత్మికే హుం ఫట్ స్వాహా ॥ ॥ 14 ॥

విద్యాఫలం ఏవం విద్వాన్ కృతకృత్యో భవతి సావిత్ర్యా ఏవ సలోకతాం జయతీత్యుపనిషత్ ॥ ॥ 15 ॥

ఓం ఆప్యాయంతు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో
బలమింద్రియాణి చ । సర్వాణి సర్వం బ్రహ్మోపనిషదం మాహం బ్రహ్మ
నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం
మేఽస్తు । తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సంతు తే మయి సంతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇతి సావిత్ర్యుపనిషత్సమాప్తః**